సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 30 । ఏప్రిల్ । 2025



ఎఫ్ఐఆర్‌తో ఆచూ'కీ'

ఒక కేసులో ఎఫ్ఐఆర్ కాకినాడ జిల్లా పోలీసు యంత్రాగానికి తలనొప్పిగా మారిన హత్య కేసు మిస్టరీని ఛేదించేలా చేసింది.




వైద్యం వికటించి చిన్నారి మృతి

రౌతులపూడి మండలం గిడజాం గ్రామానికి చెందిన చక్కా హర్షవర్ధన్ (11 నెలలు) వైద్యం వికటించి మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

8లో

కడలిలోకి 1,933 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 1,933 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 8.60 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

మండల సమావేశాలు అభినందనీయం

జిల్లా అధ్యక్షుడు వేణుకు మాజీ సీఎం జగన్ శుభాకాంక్షలు



మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వేణు, గూడూరి శ్రీనివాస్

సాక్షి, రాజమహేంద్రవరం: జిల్లాలో ప్రతి వారం ఒక్కో మండలంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తూ, పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపడం అభినందనీయమని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని నివాసంలో జగన్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు అధినేతతో మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కో ఆర్డినేటర్లు ఎంతో సహకారం అందిస్తున్నారని, పార్టీ పిలుపు ఇచ్చిన ప్రతి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

నియోజకవర్గాల వారీగా ప్రస్తుత పరిస్థితులను ఆయనకు వివరించారు. పార్టీని సంస్థాగతంగా పటిష్ఠం చేసి, సమన్వయం చేసే అంశాలపై చర్చించామని వేణు వెల్లడించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, తన వంతు బాధ్యతగా క్రమం తప్పకుండా ప్రతి వారం, వారానికో నియోజకవర్గంలోని ఒక్కో మండలంలో కార్యకర్తల ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తద్వారా కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం పెంపొందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని రోల్ మోడల్‌గా తీసుకుని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నిర్వహించాలని జగన్ పిలుపునిచ్చారని వేణు చెప్పారు.

వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ పరిశీలకుల నియామకం





రాజమహేంద్రవరం: తిప్పల గురుమూర్తిరెడ్డి

అమలాపురం: జక్కంపూడి విజయలక్ష్మి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులను నియమించింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని మూడు పార్లమెంటరీ నియోజకవర్గాలకు ముగ్గురిని నియమిస్తూ పార్టీ అధిష్టానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టారు. పార్టీ ఆవిర్భావం నుంచీ పీఏసీ, సీజీసీ సభ్యురాలిగా పదవులు నిర్వహించిన జక్కంపూడి విజయలక్ష్మిని అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలిగా నియమించారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గానికి విశాఖ జిల్లా గాజువాక మాజీ ఎమ్మెల్యే, మాజీ మున్సిపల్ చైర్మన్ తిప్పల గురుమూర్తిరెడ్డిని నియమించారు. కాకినాడ పార్లమెంటరీ పరిశీలకుడిగా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గం కోటవురట్ల మండలం తంగేడు గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ దాట్ల వెంకట సూర్యనారాయణరాజు నియమితులయ్యారు. అలాగే, కాకినాడ జిల్లా ప్రత్తిపాడుకు చెందిన పార్టీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకుడిగా నియమితులయ్యారు. పార్లమెంటరీ పరిశీలకులు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు అనుసంధానంగా పని చేస్తారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దళారి చెప్పిందే ధర

- రూ.6,500 ఖాయం చేసిన సిండికేట్
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,200
- మినుము రైతుల గగ్గోలు
- రాబడి పెట్టుబడికే సరిపోతోందని ఆవేదన



కాకరపర్రు లంకలో కోతకు సిద్ధంగా ఉన్న మినప చేలు

పెరవలి: దిగుబడి ఆశాజనకంగా వచ్చినా గిట్టుబాటు ధర లేక మినుము రైతులు నష్టాలు ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా జిరాయితీ భూముల్లో 400 ఎకరాలు, లంక భూముల్లో 2 వేల ఎకరాల్లో మినప సాగు జరుగుతోంది. దాళ్వా వరి కోతలు పూర్తయిన తరువాత మరో 2 వేల ఎకరాల్లో రైతులు మినప సాగు చేస్తున్నారు. ఇందులో వెయ్యి ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు జరుగుతోంది. పెరవలి మండలంలో 200 ఎకరాల్లో మినప సాగు జరుగుతోంది. కానూరు అగ్రహారం, కానూరు, నడుపల్లి, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, కాకరపర్రు, అజ్జరం, అన్నవరప్పాడు, ఖండవల్లి, కాపవరం గ్రామాల్లో ఈ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఎకరం విస్తీర్ణంలో మినప సాగుకు సుమారు రూ.30 వేల మేర పెట్టుబడి అవుతుంది. ఎకరానికి నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

రైతుకు సిండికాటు

క్వింటాల్ మినుములకు ప్రభుత్వం రూ.7,200 మద్దతు ధర ప్రకటించింది. అయితే, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో షరా మామూలుగానే దళారులు సిండికేటుగా మారి, రైతులను దోచుకుంటున్నారు. మినుములు నెమ్ముగా ఉన్నాయని, బెడ్డలు, రాళ్లు ఉన్నాయని, నాణ్యత లేదని పేర్కొంటూ ధర తగ్గించేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.6,500 నుంచి రూ.6,800 మాత్రమే రైతుకు చెల్లిస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వ మద్దతు ధర కంటే రైతులు క్వింటాల్‌కు రూ.700 నుంచి రూ.900 వరకూ నష్టపోతున్నారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం రైతులకు 4 క్వింటాళ్లకు రూ.28,800, 5 క్వింటాళ్లకు రూ.36,000 వరకూ రావాల్సి ఉంది. కానీ, దళారులు ధర తగ్గించేయడంతో 4 క్వింటాళ్లకు రూ.26,000, 5 క్వింటాళ్లకు రూ.32,500 మాత్రమే వస్తోంది. ఫలితంగా, మినప సాగులో పెద్దగా మిగులు ఉండటం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మినుములకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, తమ నుంచి నేరుగా కొనుగోలు చేసేదని, కానీ, ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తున్నట్లుందని రైతులు విమర్శిస్తున్నారు.

మార్కెట్టులో ధరలు

గత ఏడాది ఇదే సమయంలో మార్కెట్‌లో క్వింటాల్ మినుముల ధర రూ.9,800 పలికింది. దీనిని చూసి రైతులు ఈసారి ఎక్కువ మొత్తంలో మినప సాగు చేపట్టారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాల్ మినుముల ధర రూ.8 వేల నుంచి రూ.8,500 వరకూ ఉన్నా రైతుకు మాత్రం రూ.6,500 మాత్రమే చెల్లిస్తున్నారు. కౌలు, పురుగు మందుల వంటి వాటికి పెట్టిన పెట్టుబడికి వస్తున్న రాబడి సరిపోతోందని, లాభా లు లేకపోగా చేతిచమురు వదిలిపోతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



కానూరు అగ్రహారంలో మినుమును మాసూళ్లు చేస్తున్న కూలీలు



తీపర్రులో మినుములను శుభ్రం చేస్తున్న రైతులు

నష్టాలపాలయ్యాం



సాగు చేసే సమయంలో మినుములకు మార్కెట్లో మంచి ధరలున్నాయి. తీరా పంట చేతికి వచ్చేటప్పటికి ధరలు పడిపోయాయి. దీంతో నష్టాలు పాలయ్యాము.

– మొఘలపు సత్యనారాయణ, రైతు, తీపర్రు

అధికారుల పర్యవేక్షణేదీ!



లంకలో ఎకరం చేనులో మిను ము పంట వేశాను. ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చింది, పెట్టుబడి రూ.30 వేలు అయ్యింది, వచ్చిన సొమ్ము పెట్టుబడికి సరిపోయింది. మిగులు లేదు. దళారులు క్వింటాల్ రూ.6,500కు కొంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఎవ్వరూ ఇవ్వడం లేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ లేదు.

– దిడ్ల సంపతిరావు, రైతు, ఖండవల్లి

సీట్‌గా నిర్వహించాలి

రాజమహేంద్రవరం సిటీ: వైద్య కళాశాలల్లో ప్రవేశానికి జరిగే నేషనల్ ఎలిజిబులిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. నీట్ నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో తన చాంబర్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 8 కేంద్రాల్లో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకూ ఈ పరీక్ష జరుగుతుందన్నారు. మొత్తం 2,760 మంది ఈ పరీక్ష రాయనున్నారన్నారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద మే 3, 4 తేదీల్లో ఇంటర్నెట్, జిరాక్స్ షాపులు మూసివేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండాలని ఆదేశించారు. ఆయా కేంద్రాలకు అన్ని బస్ స్టేషన్ల నుంచీ ఉదయం 8 నుంచి ఒంటిగంట వరకూ, సాయంత్రం 5 నుంచి రాత్రి 7 గంటల వరకూ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. ముందు జాగ్రత్తగా అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని జేసీ అన్నారు.

నిబంధనల అమలుతో ప్రమాదాల నివారణ

- హైవేపై దీపాల ఏర్పాటుకు 3 నెలలెందుకు?
- రహదారి భద్రత సంఘ సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్

రాజమహేంద్రవరం సిటీ: రహదారి భద్రత, వాహన చోదక నిబంధనలు కచ్చితంగా అమలు చేయడం ద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యాన తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి రహదారి భద్రత సంఘ సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలు, మరణాల సంఖ్య ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. దీనిపై జాతీయ, రాష్ట్ర, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు దృష్టి సారించాలని, ప్రమాదాల సంఖ్యను, తీవ్రతను తగ్గించడానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు అమలు కాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జాతీయ రహదారిపై లైటింగ్ ఏర్పాటుకు మూడు నెలల సమయం ఎందుకని ప్రశ్నించారు. టెండర్లతో సంబంధం లేకుండా అత్యవసరంగా పనులు పూర్తి చేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలన్నారు. ప్రమాదాల తీవ్రతను జాతీయ రహదారుల ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై బుధవారం సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఐరాడ్ యాప్‌పై సంబంధిత శాఖల అధికారులందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర రహదారుల టోల్ ధరలు జాతీయ రహదారులతో సమానంగా ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాలు ఆ స్థాయిలో లేవని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. రహదారి అభివృద్ధి సంస్థ అధికారులు తనిఖీలు చేయాలని, ఆదాయం మాత్రమే లక్ష్యంగా పని చేస్తున్న ఏజెన్సీలు సరైన ప్రమాణాలు పాటించకుంటే నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. సమర్థ నిర్వహణ, మరమ్మతులపై జవాబుదారీగా ఉండాలని, అలా లేకుంటే సంబంధిత కాంట్రాక్టర్లపై జరిమానాలు విధించాలని స్పష్టం చేశారు. నగరంలో వేగ పరిమితి పెట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం చేయాలని, హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధించాలని ఆదేశించారు. హెచ్చరిక బోర్డుల ఏర్పాటుతో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని కలెక్టర్ ప్రశాంతి అన్నారు.

ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ, గడచిన మూడు నెలల్లో ప్రమాదాలు, మరణాలు రెట్టింపయ్యాయని చెప్పారు. ఆర్టీసీ బస్సుల వల్ల ప్రమాదాలు తగ్గాయని, కానీ నాలుగు చక్రాల వాహనాల వల్ల పెరిగాయని తెలిపారు. త్రీటౌన్ పరిధిలో ప్రమాద మరణాలు అధికమయ్యాయని, గామన్ బ్రిడ్జి నుంచి జీరో పాయింట్ వరకూ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారిపై లైటింగ్ సమస్య ఉందన్నారు. రోడ్ల పనులు చేపట్టినప్పుడు తమ శాఖకు సమాచారం ఇవ్వాలని అన్నారు. రవాణా, పోలీసు, ఇతర సమన్వయ శాఖల అధికారులు మల్టీ డిసిప్లినరీ బృందాలుగా ఏర్పడి సంయుక్త తనిఖీలు చేపట్టాలని సూచించారు. నగర పరిధిలో హెల్మెట్ ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్‌బీవీ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరించాలని సీహెచ్‌ఓల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సీహెచ్‌ఓలు

రాజమహేంద్రవరం రూరల్: ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరేళ్లు దాటిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సీహెచ్‌ఓ) అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మమత డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా కలెక్టరేట్ వద్ద సీహెచ్‌ఓలు మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ, వైద్య, ఆరోగ్య శాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద సీహెచ్‌ఓలుగా పని చేస్తున్న తాము రెండేళ్లుగా జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నామన్నారు. ఎన్‌హెచ్ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంటు ఇవ్వాలని, ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలని, ఏటా 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

బెయిల్‌పై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విడుదల



సెంట్రల్ జైలు నుంచి విడుదలై వస్తున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మంగళవారం బెయిల్‌పై విడుదలయ్యారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు అధికారులు రాత్రి 7.45 గంటలకు ఆయనను విడుదల చేశారు. ఈ నెల 12న గోరంట్ల మాధవ్‌తోపాటు అరెస్టయిన మరో ఐదుగురికి కూడా బెయిల్ మంజూరైంది. దీంతో మాధవ్‌తో పాటు వారూ విడుదలయ్యారు. మాధవ్ తోపాటు జైలు నుంచి విడుదలైన వారిలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన రమేష్, దామోదర్, శివప్రసాద్, శివయ్య, సురేందర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు వైఎస్సార్ సీపీ కేడర్‌ను ఏమీ చేయలేవని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరోసారి కూటమి పార్టీలు గెలిచే పరిస్థితి లేదన్నారు.

పతకాల విజేతకు కలెక్టర్ అభినందన

కాకినాడ సిటీ: జాతీయ స్థాయి పరుగు పందేల్లో మూడు కాంస్య పతకాలు సాధించిన యాతం నాగబాబును కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం కలెక్టరేట్‌లో అభినందించారు. 58 సంవత్సరాల నాగబాబు వెటరన్ నేషనల్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ మీట్‌లో మూడు కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా నాగబాబు కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో చాముండి విహార స్పోర్ట్స్ స్టేడియంలో జరిగిన 44వ నేషనల్ వెటరన్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్ షిప్ మీట్ 2025లో పాల్గొని ఈ పతకాలు సాధించినట్లు తెలిపారు. మూడు విభాగాలుగా జరిగిన పోటీల్లో 100 మీటర్లు, 400, 800 మీటర్ల పరుగు పందేల్లో పాల్గొని ప్రతి విభాగంలోను మూడో స్థానం సాధించి కాంస్య పతకాలు సాధించారు. ఈయన కాకినాడ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పని చేస్తున్నారు. నాగబాబు అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ షణ్మోహన్ అభిలాషించారు.

యువతి అదృశ్యం

అమలాపురం టౌన్: అమలాపురంలోని తన అక్క ఇంటికి వచ్చిన పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలోని పంజా సెంటరుకు చెందిన యాళ్ల భూమిక శివ సాయి మంగళవారం అదృశ్యమైంది. ఈ మేరకు యువతి తండ్రి యాళ్ల నాగభూషణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని తన అక్క ఇంటికి వచ్చిన భూమిక మంగళవారం ఉదయం అదృశ్యమైంది.

సెలవులు.. వికాసానికి నెలవులు!

- గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ
- విజ్ఞాన శిబిరాల షెడ్యూల్ విడుదల



గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం

రాయవరం: విద్యార్థులకు ఈ నెల 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. పలువురు విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడపడంతో పాటు, కొంత సమయాన్ని విజ్ఞాన సముపార్జనకు వినియోగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గ్రంథాలయాలను విద్యార్థులకు బాగా చేరువ చేశారు. విద్యార్థులను వేసవిలో గ్రంథాలయాలకు మరింత చేరువ చేసేందుకు గ్రంథాలయ శాఖ ప్రణాళిక రూపొందించింది. విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవడానికి, మానసిక, శారీరక వికాసంతో పాటుగా వారిలో ఉన్న సృజనాత్మకతను పెంచుకునేందుకు ఏపీ పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 45 రోజుల పాటు ఈ ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

నైపుణ్యాలు వెలికి తీసేందుకు..

వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు వివిధ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంథాలయ శాఖ ఏర్పాటు చేసింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతి రోజు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. కథలు వినడం, గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్యాన్స్, పప్పెట్ మేకింగ్, చెస్, క్యారమ్స్, క్విజ్ తదితర సృజనాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యాలను అభివృద్ధి పరుస్తారు. శిక్షణ అనంతరం విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయడంతో పాటుగా, విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తారు. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులను సమ్మర్ క్యాంపులకు పంపించేందుకు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. విద్యార్థులు కూడా తమకు ఇష్టమైన కథల పుస్తకాలు చదవడం, తిరిగి ఆ కథలను సొంత మాటల్లో చెప్పడంతో పాటు ఆటపాటలతో ఆనందించే విధంగా లైబ్రేరియన్లు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యావేత్తలను న్యాయ నిర్ణేతలుగా వినియోగించుకుంటున్నారు.

పరిస్థితి ఇదీ..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన వేసవి శిక్షణ శిబిరాలను శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు 101 లైబ్రరీలు, 2 గ్రామీణ గ్రంథాలయాలు, 161 పుస్తక అభివద్ధి కేంద్రాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని 60 గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సగటున 1,500 మంది చిన్నారులు ఈ శిబిరాల్లో పాల్గొని విజ్ఞాన సముపార్జన చేస్తున్నారు.

ఇప్పుడిప్పుడే వస్తున్నారు



వేసవి విజ్ఞాన శిబిరాలకు చిన్నారులు రావడం ప్రారంభించారు. క్రమక్రమంగా హాజరు పెరుగుతోంది. సమ్మర్ క్యాంపు వల్ల గ్రంథాలయాల విలువను విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారు. పుస్తక పఠనం అలవాటు పెరుగుతుంది.

– దడాల వెంకటరమణ, లైబ్రేరియన్, రామచంద్రపురం

సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సమ్మర్ క్యాంపులు దోహదపడతాయి. వేసవి శిక్షణ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధికంగా పాల్గొంటున్నారు. తల్లిదండ్రుల నుంచి కూడా మంచి స్పందన ఉంది.

– వీఎల్ఎన్ సాయి వరప్రసాద్, కార్యదర్శి, జిల్లా గ్రంథాలయ సంస్థ, కాకినాడ

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 – 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

వైద్యం వికటించి చిన్నారి మృతి



గిడజాంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు



వైద్యం వికటించి మృతిచెందిన హర్షవర్ధన్ (ఫైల్)

రౌతులపూడి: మండలంలోని గిడజాం గ్రామానికి చెందిన చక్కా హర్షవర్ధన్ (11నెలలు) వైద్యం వికటించి మంగళవారం మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ మేరకు వారు, గ్రామస్తులు గిడజాంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఈ ఘటనపై రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గిడజాం గ్రామానికి చెందిన హర్షవర్ధన్ ఆరోగ్య పరీక్షల కోసం తల్లితండ్రులు సంధ్య, నాగదుర్గాప్రసాద్ మంగళవారం రౌతులపూడి సినిమా సెంటర్లో ఒక ఆర్ఎంపీ వద్దకు తీసుకువెళ్లారు. వైద్యుడు ఇందన బ్రహ్మానందం బాలుడిని పరీక్షించి ఇంజెక్షన్, మందులు ఇచ్చారు. ఇంటికివెళ్లి బాలుడికి మందులు వేయగా కొంతసేపటికి ఎగఊపిరి వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో కంగారుపడ్డ తల్లితండ్రులు రౌతులపూడి సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ఆసుపత్రి వైద్యులు బాలుడిని పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. దీంతో ఆగ్రహం చెందిన బాలుడు తల్లితండ్రులు, కుటంబసభ్యులు గిడజాంలో రోడ్డుపై ఆందోళన చేశారు. అనంతరం రౌతులపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

నాళం వారి సత్రం భూముల
కౌలు వేలం వాయిదా



శృంగవృక్షం పంచాయతీ కార్యాలయం వద్ద కౌలు బకాయిలు వసూలు చేస్తున్న ఈవో దారబాబు, సిబ్బంది

- రూ. 9.27 లక్షలు చెల్లించిన పాత బకాయిదారులు
- చెల్లింపునకు మరింత గడువు ఇవ్వాలని కోరిన రైతులు

తొండంగి: రాజమహేంద్రవరానికి చెందిన నాళంవారి సత్రంకు సంబంధించి శృంగవృక్షంలోని 268.64 ఎకరాల భూమి మూడు సంవత్సరాల కౌలు వేలం ప్రక్రియ మంగళవారం వాయిదా పడింది. దేవదాయ, ధర్మాదాయశాఖ సత్రం కార్యనిర్వహణాధికారి చందక దారబాబు, పర్యవేక్షణాధికారి రమణి, ఇతర సిబ్బంది 268.64 ఎకరాలకు 13 బిట్లుగా కౌలు వేలం నిర్వహించేందుకు శృంగవృక్షం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాట్లు చేశారు. గతంలో సత్రం భూములకు వేలం సొమ్మును బకాయిదారులు 52 మంది రూ1.36 కోట్ల వరకూ చెల్లించాల్సి ఉంది. రైతులందరూ పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని వేలం పాటలో పాల్గొనేందుకు బకాయిలు చెల్లిస్తామని అధికారులకు వివరించారు. కొద్ది మంది రైతులు రూ.9.27 లక్షలు చెల్లించారు. మరి కొంత మంది సమయం ఇస్తే బకాయిలు చెల్లించి వేలం పాటలో పాల్గొంటామని కోరారు. ప్రస్తుతం వేలంలో పాల్గొనేందుకు రైతులు పూర్తిస్థాయిలో హాజరుకాని నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వేలం ప్రక్రియను వాయిదా వేస్తున్నట్టు ఈవో దారబాబు తెలిపారు. రైతుల అభ్యర్థనను దేవదాయశాఖ ఆర్‌జేసీకి తెలియజేసి త్వరలో వేలం షెడ్యూల్ వెల్లడిస్తామని తెలిపారు.

భూములను గుట్టుగా రాయించుకునేందుకు రాజకీయ ఒత్తిడులు

నాళం వారి సత్రం భూములు కేవలం తక్కువగా 13 బిట్లుగా వేలం నిర్వహిస్తున్నారు. దీంతో ఎక్కువ మంది పాల్గొనేందుకు వీలు లేదు. దీర్ఘ కాలం నుంచి దేవదాయ ధర్మాదాయశాఖ అధికారులను రాజకీయ ఒత్తిడి చేసి తక్కువ ధరకు మొక్కుబడిగా బహిరంగ వేలం తంతు నిర్వహించి కొందరు భూములను దక్కించుకున్నారని, వారు ఇతరులకు సబ్ లీజుకు ఇచ్చి సొమ్ము అక్రమంగా సంపాదించారని రైతులు ఆరోపిస్తున్నారు. అలా సొమ్ము చేసుకున్న పాట దారులు సత్రానికి చెల్లించకపోవడంతో బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. ప్రస్తుతంసత్రం అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలో కార్యనిర్వహణాధికారిని బదిలీ చేయించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. సత్రం భూములను ఎక్కువ బిట్లుగా విభజించి ఎక్కువ మంది బహిరంగా వేలంలో పాల్గొనే వెసులుబాటు కల్పిస్తే సత్రంకు కౌలు ఆదాయం కూడా పెరుగుతుందని రైతులంటున్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్ హడావుడితో పోర్టుకు నష్టం

- దెబ్బతింటున్న ఎగుమతి, దిగుమతులు
- ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న కార్మికులు
- సీపీఎం సమావేశంలో నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కాకినాడ సిటీ: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హడావుడితో దెబ్బతింటున్న పోర్టు ఎగుమతి, దిగుమతులపై అధికారులు దృష్టి సారించి ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్న కార్మికులను ఆదుకునేందుకు, కాకినాడ పరిసర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఉపాధి కల్పించే పోర్టు ఎగుమతి దిగుమతులు సజావుగా సాగేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని సీపీఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం సాయంత్రం సుందరయ్యభవన్‌లో కె.సత్తిరాజు అధ్యక్షత జరిగిన సమావేశంలో సీపీఎం నాయకులు మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోర్టులో బియ్యం ఎగుమతులపై చేసిన హడావుడి వల్ల పోర్టు కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. కాకినాడ పోర్టు ద్వారా జరగాల్సిన ఎగుమతి, దిగుమతులు విశాఖ, కృష్ణపట్నం రేవుల నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. దీనివల్ల పెద్ద సంఖ్యలో కార్మికులు ఉపాధి దొరకక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాకినాడ పోర్టు లావాదేవీలు వేగంగా జరిగి కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరిగే విధంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీపీఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జిల్లా మంత్రిగా ఉండడం వల్ల పిఠాపురంతో పాటు జిల్లా అంతా అభివృద్ధికి అవకాశాలు ఉంటాయని, దానిలో భాగంగా జిల్లా కేంద్రమైన కాకినాడ కూడా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశిస్తున్నారన్నారు. అభివృద్ధికి కొలమానం ఉపాధి కల్పనే అనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. అయితే ఉపముఖ్యమంత్రి కార్యాచరణ అందుకు తగిన విధంగా లేదన్నారు. అభివృద్ధి దిశగా ఉపముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సీపీఎం కోరుతోందని సీపీఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, దుంపల ప్రసాద్, వేణు, నాయకులు అన్నారు.

గుడిలో చోరీ చేసి పట్టుబడ్డ దొంగ

రెండు కేజీల వెండి వస్తువుల స్వాధీనం



దొంగతనానికి పాల్పడిన వ్యక్తి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు



ఆలయం వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

పిఠాపురం: చేతికి గ్లౌజులు, కాళ్లకు సాక్సులు, మొహానికి మాస్క్ వేసుకుని దర్జాగా గుళ్లోకి ప్రవేశించాడు. ఎక్కడా తన ఆనవాళ్లు బయట పడకుండా జాగ్రత్త పడుతూ దేవుడి గుడిని కొల్లగొట్టాడు. దొంగిలించిన సొత్తుతో పరారవ్వడానికి ప్రయత్నించి గ్రామస్తులకు చిక్కాడు. గొల్లప్రోలు శివాలయంలో మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివీ.. మంగళవారం తెల్లవారుజామున గొల్లప్రోలు నడిబొడ్డున ఉన్న శివాలయం గోడ దూకి ఒక వ్యక్తి పారిపోతుండగా స్థానికులు అనుమానం వచ్చి పట్టుకున్నారు. ఆరా తీస్తే అతను దొంగతనం చేసి పారిపోతున్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో గొల్లప్రోలు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారించగా అతను గుడిలో దొంగతనం చేసి పారిపోతున్నట్లు గుర్తించారు. అతని నుంచి గుడిలో ఉండే సుమారు రెండు కేజీల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. అతనిని గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన పసుపులేటి శివాజీగా గుర్తించారు. అర్ధరాత్రి శివాలయంలో ప్రవేశించి ఆలయ తలుపులు పగుల గొట్టి స్వామి వారికి అలంకరించే వెండి వస్తువులను దొంగిలించి పారిపోవడానికి ప్రయత్నించినట్లు గుర్తించారు. ఇతను గతంలో పలు చోరీ కేసుల్లో నిందితుడని పోలీసులు చెబుతున్నారు. ముందు జాగ్రత్తగా చేతికి గ్లౌజులు, కాళ్లకు సాక్సులు, మొహానికి మాస్క్ వేసుకుని దొంగతనం చేసినట్లు పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్ఐఆర్‌తో ఆచూ'కీ'



మృతదేహం లభ్యమైన ప్రాంతంలో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)

పిఠాపురం: ఒక కేసులో ఎఫ్ఐఆర్ కాకినాడ జిల్లా పోలీసు యంత్రాగానికి తలనొప్పిగా మారిన హత్య కేసు మిస్టరీని ఛేదించేలా చేసింది. నాలుగు బృందాలు 60 రోజులుగా చేస్తున్న దర్యాప్తును ఒక్క ఎఫ్ఐఆర్ కొన్ని గంటల వ్యవధిలోనే ఆధారాలతో సహా నిందితులను పట్టించినట్లు సమాచారం. గత ఫిబ్రవరి 28న గొల్లప్రోలు మండలం చేబ్రోలు 216 జాతీయ రహదారి పక్కన లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం కేసు మిస్టరీని పోలీసులు ఛేదించినట్లు తెలిసింది. ఈ కేసులో మృతదేహం లభ్యమవ్వడం తప్ప ఎటువంటి ఆధారాలు పోలీసులకు లభించలేదు. ఈ కేసు దర్యాప్తునకు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఏర్పాటు చేసిన పోలీసులు రెండు నెలలుగా చనిపోయిన వ్యక్తి వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. 30 నుంచి 40 ఏళ్ల వయసు గల ఒంటిపై దుస్తులు, ఇతర వస్తువులు లేకుండా పడి ఉన్న పురుషుడి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. అనుమానాస్పద స్థితిలో మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం హత్య కేసుగా నిర్ధారణకు వచ్చారు. మృతుడి దుస్తులు, మొలతాడు, చేతి కంకణం మృతదేహం పడి ఉన్న సమీపంలోనే దొరకడంతో పాటు మృతుడి ఒంటిపై కత్తి పోట్లు ఉండడంతో అతనిని ఎవరో హత్య చేసి ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానించి ఆ దిశగా దర్యాప్తు ప్రారంభించారు. రాష్ట్రంలోని అన్ని పోలీసు స్టేషన్లకు మృతుడి ఫొటోలు పంపిన పోలీసులు వ్యక్తులు గల్లంతు అయిన సంఘటనలపై ఆరా తీశారు. అయినా ఏవిధమైన ఆధారం లభించలేదని తెలిసింది.


ఆన్‌లైన్‌లో చూసి..

ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లా యలమంచిలిలో ఆదివారం ఒక మిస్సింగ్ కేసుకు సంబంధించి ఒక ఎఫ్ఐఆర్ నమోదైంది. దానిని అక్కడి పోలీసులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. పిఠాపురంలో హత్య కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసు బృందం ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్ చూసి ఆ కేసుకు సంబంధించిన ఫొటోను పరిశీలించారు. మిస్సింగ్ అయిన వ్యక్తి.. ఇక్కడ దొరికిన మృతదేహం ఒకటేనని గుర్తించారు. అక్కడకు వెళ్లి ఆరా తీయగా అసలు విషయం బయటపడినట్లు విశ్వసనీయ సమాచారం. భార్య ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పడేసినట్లు పోలీసుల దర్యాప్తులో బయటపడినట్లు తెలిసింది. రెండు నెలలుగా తన కుమారుడు కనిపించడం లేదని ఒక తల్లి ఇచ్చిన ఫిర్యాదులో ఇచ్చిన ఫొటోను ఇక్కడ లభ్యమైన మృతదేహం ఫొటోతో సరి చూడగా రెండు ఒకటే కావడంతో కేసు మిస్టరీ వీడినట్లు తెలుస్తోంది. మృతుడు లోవరాజు (37) రైళ్లలో చిన్న చిన్న దొంగతనాల్లో నిందితుడు. వివాహేతర సంబంధం పెట్టుకున్న మృతుని భార్య తన భర్తను అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశంతో ప్రియుడి సహాయంతో హత్య చేసి ఇక్కడకు తీసుకువచ్చి పడేసినట్లు సమాచారం. నిందితులను అదుపులోకి తీసుకున్న యలమంచిలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలలుగా కాకినాడ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ముప్పుతిప్పలు పెట్టిన హత్య కేసు మిస్టరీ వీడడంతో ఇక్కడి పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

తల్లికి బాలిక అప్పగింత

తుని: ఇంటి నుంచి బయటకు వచ్చి తుని రైల్వేస్టేషన్‌కు వచ్చిన బాలికను తల్లికి అప్పగించామని జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ రైల్వే సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు డీఎస్పీ జయరాం పర్యవేక్షణలో మంగళవారం తుని రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ సిబ్బందితో కలిసి ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా తనిఖీలు నిర్వహించామన్నారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై బాలిక కనిపించింది. వాకబు చేయగా విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన బాలిక రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చినట్టు చెప్పిందన్నారు. దీంతో కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చి ఆమె తల్లికి అప్పగించామని తెలిపారు.

కేరళలో కోనసీమ వాసి గల్లంతు



వీరబాబు

ఐ.పోలవరం: చేపల వేట ద్వారా జీవనోపాధి పొందాలని కేరళ వెళ్లిన కోనసీమ వాసి గల్లంతయ్యాడు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల గ్రామానికి చెందిన అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన యువకుడు సంఘాని వీరబాబు పొట్ట చేత పట్టుకుని బతుకు తెరువు కోసం ఆరు నెలల క్రితం కేరళ వెళ్లాడు. అక్కడ పలు ప్రాంతాల్లో వేటాడుతూ ఉపాధి పొందుతున్నాడు. సముద్రం మీద చేపల వేట కోసం బోటు మీద వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి సముద్రంలో పడిపోయాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరగగా ఇప్పటికీ వీరబాబు ఆచూకీ లభ్యం కాలేదు. బోటు సిబ్బంది, కేరళ నేవీ, కోస్టుగార్డు అధికారులు సముద్రంలో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. వీరబాబుకు భార్య, ఆరు నెలల పాప, తల్లి ఉన్నారు. కుటుంబం మొత్తం అతని మీద ఆధారపడి జీవిస్తుంది. ప్రమాద విషయం తెలియడంతోపాటు ఇంత వరకు అతని ఆచూకీ లభ్యం కాలేదని తెలిసి అతని కుటుంబం తల్లడిల్లిపోతోంది. ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి వీరబాబు ఆచూకీ తెలుసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

విద్యార్థిని సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతి

- అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం
- బాధితులకు అండగా వైఎస్సార్ సీపీ



మంటల్లో సరిఫికెట్లు కోల్పోయిన బాధితురాలు నూకరత్నం



బాధితులకు నిత్యావసర సరకులను అందజేస్తున్న యనమల కృష్ణుడు, వైఎస్సార్ సీపీ నాయకులు

తుని: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడంతో కష్టపడి ఉద్యోగం సాధించాలని కలలు కన్న విద్యార్థికి కొండంత కష్టం కలిగింది. ఐదేళ్లుగా డీఎస్సీ కోసం శ్రమిస్తున్న విద్యార్థి నూకరత్నం ఆశలు అడియాశలు అయ్యాయి. అగ్ని ప్రమాదం రూపంలో కష్టార్జితం బూడిద పాలు కావడంతో కన్నీటి పర్యంతం అయ్యారు. వివరాల్లోకి వెళితే సోమవారం సాయంత్రం తుని మండలం సీహెచ్.అగ్రహారం గ్రామంలో రెండు పోర్షన్ల తాటాకు ఇంటికి నిప్పు అంటుకుని సర్వస్వం కోల్పోయారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... మదాసి లోవరాజు, సిరిసిపల్లి అమ్మాజీ కుటుంబాలు రెండు పోర్షన్లు తాటాకు ఇంటిలో ఉంటున్నారు. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులు, నగదు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఇందులో మదాసి లోవరాజు కుమార్తె నూకరత్నంకు చెందిన పది, ఇంటర్, డిగ్రీ ఒరిజనల్ సర్టిఫికెట్లు కాలిపోయాయి. దీంతో పాటు దాచుకున్న రూ.1.40 లక్షలు బూడిద పాలు అయ్యాయి. నూకరత్నం కోటనందూరులో హాస్టల్‌లో ఉంటూ డీఎస్సీకి సన్నద్ధం అవుతోంది. అగ్ని ప్రమాదం జరిగిందని, సర్టిఫికెట్లు కాలిపోయాయని తెలియడంతో తల్లడిల్లింది. ఐదేళ్లుగా డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నానని, ఒరిజనల్ సర్టిఫికెట్లు కాలిపోవడంతో భవిష్యత్ అంధకారం అయిందని కన్నీరు పెట్టుకుంది. ప్రభుత్వం ఆదుకోకపోతే భవిష్యత్‌ను కోల్పోతానని ఆవేదన వ్యక్తం చేసింది. విద్యాశాఖ అధికారులు స్పందించి సర్టిఫికెట్లు ఇచ్చే ఏర్పాటు చేయాలని వేడుకుంది. తుని అగ్నిమాపక అధికారి రాముడు ఆధ్వర్యంలో మంటలను ఆర్పివేశారు.

నూకరత్నంకు అండగా వైఎస్సార్ సీపీ

ప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని పార్టీ సీనియర్ నాయకుడు యనమల కృష్ణుడు భరోసా ఇచ్చారు. ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న ఆయన బాధితులను మంగళవారం పరామర్శించారు. విద్యార్థి నూకరత్నం కన్నీటిని చూసిన వైఎస్సార్ సీపీ నాయకులు చలించిపోయారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి సర్టిఫికెట్లు ఇచ్చేలా విద్యాశాఖ అధికారులను ఆదేశించాలన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకువెళ్తామన్నారు. రెండు కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు పోల్నాటి శేషగిరిరావు, పోతల రమణ, సర్పంచ్ లంక సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు లంక తాతీలు, మామిడి శెట్టి శ్రీను,ఆవాడ సత్యనారాయణ, లంక చిన్నాలు, గోవిందు, చిట్టిబాబు, అప్పారావు పాల్గొన్నారు.